# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీ4 అమలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు.**
2. **బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం దక్షిణ ఒడిశా సమీపంలో తీరం దాటిందని వాతావరణ శాఖ వెల్లడించింది.**
3. **ప్రకాశం బ్యారేజ్‌కి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్య ప్రసాద్  సూచించారు.**
4. **రాష్ట్రంలో ఎరువుల సరఫరాను ప్రణాళికబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కింజరాపు కె. అచ్చెన్నాయుడు అదేశించారు.**

==========================

రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం-పీ4 అమలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బంగారు కుటుంబాల, మార్గదర్శకులతో ముఖ్యమంత్రి ఈరోజు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదరిక నిర్మూలనకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం కింద దాదాపు 13 లక్షల బంగారు కుటుంబాలను ప్రభుత్వం గుర్తించిందన్నారు.

-------------------------

వాయవ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం దక్షిణ ఒడిశా గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోస్తాంధ్ర ప్రాంతంలో 35-45 కిలో మీటర్ల వేగంతో తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడిస్తూ వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

మరోవైపు వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ  నేపథ్యంలో

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఈరోజు  కూడా సెలవు ప్రకటించారు.మరో వైపు  శ్రీకాకుళం జిల్లాలో  వర్షాలు విస్తారంగా వర్షాలు కురుస్తున్న  నాగావళి నదిలో క్రమంగా వరద ప్రవాహం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులకు కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ  మంత్రి అచ్చెన్నాయుడు పలు సూచనలు చేశారు.  మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరికలు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు

---------------------------

కృష్ణా, గోదావరి నదులకు వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణా, గోదావరి పరీవాహక 13 జిల్లాల కలెక్టర్లతో విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శి  జి.జయలక్ష్మి ఈరోజు శ్రవణ మాధ్యమ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేయాలని చెప్పారు. నిత్యవసర వస్తువులు, వైద్య, శానిటేషన్ సామాగ్రిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

---------------------------

కృష్ణానది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం పెరుగుతోందని జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు రవికిరణ్  తెలిపారు. విజయవాడలో ఆయన ఈరోజు పాత్రికేయులతో బ్యారేజ్ నుండి మొత్తం 70 గేట్ల ద్వారా  వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. రేపటికి వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని రవికిరణ్ తెలియజేస్తూ,

వాయిస్..28 సెకన్లు

---------------------------

ప్రకాశం బ్యారేజ్‌కి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్  సూచించారు. కృష్ణానది కరకట్ట వెంబడి పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. కరకట్ట ప్రాంతంలో గండి పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సామాజిక మాధ్యమాలలో వదంతులను నమ్మవద్దని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు కోసం ముందస్తుగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎమ్. ధ్యానచంద్ర అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో సౌకర్యాలను ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా లోతట్టు ప్రాంతాల్లో చేరే నీటిని మోటర్ల సాయంతో తోడివేస్తున్నామని చెప్పారు. బుడమేరు నీటి ప్రవాహంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని ధ్యానచంద్ర తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ఎరువుల సరఫరాలో పొరపాట్లకు తావివ్వకుండా, ప్రణాళికబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అదేశించారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీపై విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువుల కోసం పలు ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి ప్రభుత్వం దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు ఇబ్బందులను గుర్తించి ఆయా ప్రాంతాలకు మార్క్ ఫెడ్ గోదాములలో నిల్వ ఉన్నఎరువులను త్వరితగతిన అందజేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ఈరోజు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. 1918 ఆగస్టు 19న మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ నగరంలో జన్మించిన ఆయన... దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. భారత స్వాతంత్ర్య సాధన కోసం ఆయన ఎనలేని పోరాటం చేశారు. తన వాక్చాతుర్యంతో ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. గొప్ప పండితుడు, మేధావి అయిన శంకర్ దయాళ్ శర్మ.. స్వాతంత్ర్యానంతరం మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా, దేశ 9వ రాష్ట్రపతిగా పలు కీలక పదవులు నిర్వహించి... దేశానికి సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారు. 1999 అక్టోబర్ 9వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ఈ రోజు నుంచి పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు నుంచి ఈ నెల 23 వ తేదీ వరకు, అలాగే 28వ తేదీ నుంచి 30 వరకు.. మొత్తం 8 రోజుల పాటు పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో 5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల వయసున్నవిద్యార్థులు ఆధార్ లో బయోమెట్రిక్, ఫోటో వంటివి పాఠశాలల్లో నవీకరణ చేసుకోవాలని సూచించారు.

---------------------------

పర్యావరణానికి పరిరక్షణకు జనపనార సంచుల వినియోగాన్ని ప్రతిఒక్కరూ అలవాటు చేసుకోవాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం పంచాయతీ కార్యాలయంలో గుడ్డ సంచులను ఆయన ఈరోజు పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధాన్ని సామాజిక బాధ్యతగా భావించి నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించేందుకు ముందుకు రావాలని కోరారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================